# అవతార్ మెహెర్ బాబా పర్పెట్యువల్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్

# నివాసితుల ప్రవర్తనా నియమావళి (Resident Code of Conduct)

(సవరణ: సెప్టెంబర్ 2025)

నివాసితుల ప్రవర్తనా నియమావళికి సంబంధించినంత వరకు అవతార్ మెహెర్ బాబా పర్పెట్యువల్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్, అవతార్ మెహెర్ బాబా ట్రస్ట్ (“ఫస్ట్”), మెహెర్ ఫ్రీ డిస్పెన్సరీ (మెహెరాజాద్), మరియు మెహెరాజాద్ పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్ అన్నింటినీ కలిపి ఇందులో ట్రస్ట్ అని వ్యవహరించడమైనది.

అవతార్ మెహెర్ బాబా స్వయంగా ఆమోదించి, సంతకం చేసిన మొట్టమొదటి అవతార్ మెహెర్ బాబా ట్రస్ట్ డీడ్ (పత్రం)లో, ఆయన తన ట్రస్ట్ కోసం అనేక లక్ష్యాలను నిర్దేశించారు. ట్రస్ట్ ద్వారా ఆయనకు సేవ అందించాలని ఎంచుకునే ఆయన ప్రేమికులకు ఇవి ఆయన వాంఛితాలుగా కొనసాగుతాయి. ఈ వాంఛితాలే మెహెరాబాదులో, మెహెరాజాదులో మరియు ట్రస్ట్ కార్యాలయంలో ఉండే నివాసితుల జీవితాలకు ఒక నిర్దిష్ట విధానాన్ని మరియు పునాదిని అందిస్తాయి. ఆయన ‘ఉనికి’ ప్రగాఢంగా అనుభూతి చెందే ఈ అత్యంత పవిత్రమైన ప్రదేశాలకు సమీపంలో నివసించడం అనేది కేవలం ఒక వరం మాత్రమే కాదు, ఒక బాధ్యత కూడా. ఇది నివాసితులకు ఆయనచే పునీతం చేయబడిన వాతావరణంలో జీవించే అపూర్వమైన అవకాశాన్ని ఇస్తుంది. అదే సమయంలో, ఆయన ట్రస్ట్ డీడ్ లక్ష్యాలలో పేర్కొన్నట్లుగా, ఆయన వాంఛితాలను నెరవేర్చడంలో సహాయపడటం ద్వారా, సేవ రూపంలో తమ ప్రేమను వ్యక్తీకరించడానికి వారికి అపారమైన అవకాశాలను అందిస్తుంది.

1969 నుండి ట్రస్ట్ చరిత్రలో ఎక్కువ భాగం, తొలుత బాబా సోదరి మరియు సన్నిహిత శిష్యురాలైన మణి నడిపించారు, ఆ తర్వాత మండలి సభ్యుడైన భావు కల్చూరీ దానిని నడిపించారు. ఇప్పుడు ట్రస్ట్ నాయకత్వం మండలి సభ్యుల చేతిలో లేని దశలోకి ప్రవేశించినందున, వర్తమానంలోనే గాక

భవిష్యత్తులో రాబోయే నివాసితులకు సైతం మార్గదర్శకంగా ఉండే సూత్రాలను అధికారిక నియమావళి (Code) రూపంలో స్పష్టంగా తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైనదని ట్రస్టీలు భావిస్తున్నారు.

1. **నివాసితులంటే ఎవరు?:** ఈ నియమావళి కోసం ట్రస్ట్ ఎస్టేట్‌లో నివసించే వారెవరైనా, ట్రస్ట్ ద్వారా స్పాన్సర్ (sponsor) చేయబడిన నివాసితులు మరియు ట్రస్ట్ ఎస్టేట్ వెలుపల నివసిస్తున్న ఇతర స్వచ్ఛంద కార్యకర్తలు (volunteers) అందరూ 'నివాసితులు'గా పరిగణించబడతారు. నివాసితులుగా అర్హత పొందిన ట్రస్టీలు కూడా ఈ నిర్వచనం పరిధిలోకి వస్తారు.
2. **ఒక విస్తృత నియమం (**A Broad Principle**):** ఈ నియమావళిలోని నియమాలు సర్వసాధారణమైనవి గనుక ప్రతీ సందర్భానికి తగిన నియమం ఇందులో లేకపోవచ్చును. కాబట్టి అవతార్ మెహెర్ బాబా నిర్దేశించిన ఆధ్యాత్మిక విలువల ఆధారంగా ఇంగిత జ్ఞానాన్ని మరియు మంచి నిర్ణయాన్ని (Good judgment) అలాంటి పరిస్థితుల్లో నివాసితులు ఉపయోగించాలి.
3. **ప్రవర్తన మరియు నిజాయితీ (**Conduct and Integrity):
    - **a)** బాబా ప్రేమికుల దృష్టిలోను మరియు సాధారణ ప్రజల దృష్టిలోను, ప్రతి నివాసి ట్రస్ట్‌కు ప్రతినిధిగా ఉంటారు. అందువల్ల నివాసితులు అవతార్ మెహెర్ బాబా సూచించిన అత్యున్నత ఆధ్యాత్మిక విలువలు మరియు ప్రవర్తనకు అనుగుణంగా నైతిక మరియు ధార్మిక ఆదర్శాలకు కట్టుబడి ఉండాలి. వారి ప్రవర్తన ఇతరులకు ఆదర్శవంతంగాను, నిస్వార్థత ప్రతిబింబించేలా ఉండాలి.
    - **b)** నివాసితులు నిజాయితీగా, వివేకంతో ట్రస్ట్ యొక్క ఉన్నత శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పనిచేయాలి. వారు తమ కోసం, తమ కుటుంబం, స్నేహితులు లేదా తమకు సంబంధం ఉన్న ఏదైనా బాహ్య వర్గం, సంస్థ లేదా సంఘం కోసం ఆర్థిక లేదా ఇతర ప్రయోజనాలను పొందడానికి పని చేయకూడదు.

c) వారు చేసే ప్రతి పనిలోను, నివాసితుల వ్యవహార శైలి ప్రవర్తన ప్రియతముని సత్య ప్రేమ సందేశాలను ప్రతిబింబించాలి. నిజానికి ఏదీ ప్రియతముని స్థాయిని దిగ జార్చలేదు. ఏ విధంగానైతే మలినం సముద్రాన్ని కలుషితం చేయ లేదో, అలాగే ఏదీ కూడా ప్రియతముని ఔన్నత్యానికి భంగం కలిగించ లేదు. అయినప్పటికీ అశ్రద్ధతో, అగౌరవంతో, అవిధేయతతో, నిజాయితీ లేని ప్రవర్తనతో అలాంటి వారు చేసే ప్రియతముని సేవలోని పవిత్రతను మాధుర్యాన్ని తగ్గిస్తుంది. అలాగే ప్రపంచ నలుమూలల నుండి ఈ యుగావతారుడైన మెహెర్ ప్రభువుకు నివాళులర్పించడానికి వచ్చే ఆయన ప్రేమికులకు బాధను కలిగించవచ్చు.

d) నివాసితులందరు ప్రియతముని అభిమతానుసారం ఇతరులకు బాధను లేదా విద్వేషాన్ని కలిగించే మాటలను లేదా చేతలను వర్జించి ఒకరికొకరు సమన్వయ స్ఫూర్తితో మసలుకుంటూ, ట్రస్ట్ పరిసరాలలోని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంరక్షించేలా నడుచుకోవాలి. ఏ రకమైన దుర్భాషలు, బెదిరింపులు— అవి భౌతికమైనవి అయినా, మౌఖిక మైనవి అయినా, ఉద్రిక్తపరమైనవి అయినా లేదా లైంగిక వేధింపులైనా— సహించబడవు.

4. **ట్రస్ట్ పరిసరాల్లో చేపట్టే స్వచ్ఛంద సేవ** (Honorary Seva on the Trust Estate):

a) నిస్వార్ధంగా సేవలందించడమే నివాసితుల ప్రాధమిక బాధ్యత. అటువంటి సేవను దయతో, ఔదార్యంతో అందించాలనే విషయంలో మెహెర్ బాబా చాలా ఖచ్చితంగా ఉండేవారు. బాబా మాటలు ఈ భావనను అద్భుతంగా ఇలా వ్యక్తం చేస్తాయి: “ప్రేమ ఇవ్వడం లోనే ఆనందాన్ని, వైభవాన్ని పొందుతుంది; తీసుకోవడంలో కాదు. అందువల్ల ప్రేమించడాన్ని మరియు ఇవ్వడాన్నే అలవర్చుకోనండి మరియు ఇతరుల నుండి ఏదీ ఆశించకుండా ఉండండి.”

b) ట్రస్ట్ ఎస్టేట్‌లో బాబాకు సేవలందించడమంటే, ట్రస్ట్ వారు కల్పించే సేవా అవకాశాలను స్వీకరించడం కూడా అందులో అంతర్భాగమేనని నివాసితులు గ్రహించాలి.

c) ట్రస్ట్ ద్వారా స్పాన్సర్ చేయబడిన నివాసితులు మరియు ట్రస్ట్ ఎస్టేట్‌లో నివసిస్తున్నవారు తమ జీవితాలను ప్రియతముడైన బాబాకు అంకితం చేయడానికి ఇక్కడ ఉన్నారు. వారు తమ సమయంలో గణనీయమైన భాగాన్ని ట్రస్ట్ కోసం పని చేయడం ద్వారా ఆయనకు సేవ చేయడానికి వెచ్చించాలని సాధారణంగా ఆశించబడుతుంది.

5. **పక్షపాతం (**Favouritism**), వివక్షత (**Discrimination**) మరియు వేధింపులు (**Harassment**) ఉండకూడదు:** నివాసితులందరూ స్త్రీ పురుషులనే భేదం లేకుండా, ట్రస్ట్‌లో వారి హోదాతో సంబంధం లేకుండా అందరినీ సమానంగా చూసే వాతావరణాన్నికల్పించాలి మరియు ప్రోత్సహించాలి. వారి వారి విధులను నిర్వర్తించేటప్పుడు, నిర్ణయాలు కేవలం చిత్తశుద్ధి ఆధారంగా తీసుకోవాలి మరియు సామరస్య స్ఫూర్తితో వాటిని అమలు చేయాలి.
6. **దేశ, రాష్ట్రాల చట్టాలకు కట్టుబడి ఉండాలి:** తన ప్రేమికులు దేశ చట్టాలను గౌరవించి, పాటించాలన్నది బాబా యొక్క స్పష్టమైన అభిమతము. కాబట్టి నివాసితులందరూ అమలులో ఉన్న చట్టాలు, నియమాలు మరియు నిబంధనలను పూర్తిగానూ, శ్రద్ధగానూ పాటించి తీరాలి. ట్రస్ట్ ద్వారా స్పాన్సర్ చేయబడిన నివాసితులు చట్టాన్ని ఉల్లంఘించకుండా ఉండాల్సిన తమ బాధ్యతను పూర్తిగా అవగాహన చేసుకోవాలి మరియు అంగీకరించాలి. ఎందుకంటే అలా చట్టాలను ఉల్లంఘించడం బాబా అభిమతానికి విరుద్ధంగా నడవటమే గాక ట్రస్ట్ యొక్క పరువు, ప్రతిష్టలను దిగ జార్చి, ప్రభుత్వాధికారులతో వారికి గల సత్సంబంధాలకు భంగం కలగజేసినట్లువుతుంది.
7. **రాజకీయ అనుబంధాలు ఉండకూడదు:** నివాసితులెవ్వరు రాజకీయాలతో సంబంధం పెట్టుకోవడం గాని రాజకీయాల్లో పాల్గొనడం గాని చేయరాదు.
8. **మత మార్పిడి వద్దు** (No Proselytising): తన కోసం ఎవరూ తమ మతాలను మార్చుకోవడం గానీ, కొత్త మతాన్ని స్వీకరించడం గానీ అవసరం లేదని, అటువంటి మార్పు తన అభిమతం కాదని మెహెర్ బాబా అనేక పర్యాయాలు స్పష్టం చేశారు. అన్ని మతాలను ఆయన గౌరవించారు. ఏ మతమైనా నిజాయితీగా అనుసరిస్తే సత్యం వైపునకే నడిపిస్తుందని

చెప్పారు. బోధనల కంటే, తన సందేశాన్ని జీవితంలో ప్రేమ, నిజాయితీ, నమ్రత మరియు నిస్వార్థ సేవల ద్వారా ఆచరించడమే ఉన్నతమైన మార్గమని మెహెర్ బాబా నొక్కి వక్కాణించారు.

9. **కర్మకాండలు, ఆచారాలు మరియు క్రతువుల అవసరం లేదు:** బాహ్య ఆచారాలు, కర్మకాండలు మరియు క్రతువుల కంటే భగవంతుని పట్ల ప్రేమ మరియు దైనందిన జీవితంలో నిజాయితీ చాలా ముఖ్యమైనవి - అవతార్ మెహెర్ బాబా బోధనల సారం ఇదే.

10. **మాదక ద్రవ్యాలు నిషేధం:** తన ప్రేమికులకు మెహెర్ బాబా ఇచ్చిన ఆదేశాల ప్రకారం, నివాసితులు గంజాయి, భంగ్, నల్లమందు మొదలైన వాటితో సహా అన్ని చట్టవిరుద్ధమైన లేదా డాక్టర్ సూచించని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. అటువంటి మాదక ద్రవ్యాలను సేవించే లేదా కలిగివున్న ఏ వ్యక్తినైనా, వెంటనే ట్రస్ట్ ఎస్టేట్ నుండి వెళ్ళిపొమ్మని ఆదేశించడమే కాకుండా, వారిని స్వచ్ఛంద సేవా కార్యక్రమాల నుండి కూడా తొలగించడం జరుగుతుంది.

11. **క్షుద్ర అభ్యాసాలకు తావులేదు** (No Occult Practices): ఈ మార్గదర్శకానికి సంబంధించి, "క్షుద్ర అభ్యాసాలు" అనే పదం యొక్క పరిధిలోకి ఈ క్రింద పేర్కొన్న అంశాలు వస్తాయి: అగోచర శక్తుల నుండి సందేశాలను అందుకుంటున్నామని భావించే ఆటోమేటిక్ రైటింగ్ లేదా ఆత్మలతో సంప్రదింపులు జరపడం; రేకి, ప్రాణిక్ హీలింగ్ లేదా తదితర విధానాల వంటి శక్తి-ఆధారిత ప్రక్రియలు; అతీంద్రియ దృష్టి (Clairvoyance), ఇతరులకు మాధ్యమంగా వ్యవహరించడం (Channeling) లేదా ఆత్మలకు మధ్యవర్తిత్వం (Mediumship) నెరపడం వంటి పారలౌకిక లేదా మానసిక శక్తులకు సంబంధించిన ప్రకటనలు; టారో కార్డ్స్ (Tarot cards) లేదా వీజా బోర్డ్స్ (Ouija boards) వంటి భవిష్యవాణిని తెలిపే సాధనాలు; ఫలితాలను ముందుగా ఊహించడానికి లేదా ప్రభావితం చేసే ఉద్దేశంతో నిర్వహించే క్షుద్ర క్రతువులు; మరియు 'ప్రత్యేక శక్తులను' ప్రసాదిస్తాయని లేదా అభివృద్ధి చేస్తాయని చెప్పే ఏ ఇతర సాధనలు. "క్షుద్ర అభ్యాసాలు" అనే పదం యొక్క పరిధిలోకి ఇవి మాత్రమే కాకుండా, ఇతర అంశాలు సైతం కూడా రావచ్చును; అనగా ఈ పదం వీటికి మాత్రమే పరిమితం కాదు.

మెహెర్ బాబా అభిమతాన్ని మరియు సందేశాల స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని, కేవలం అవతార్ మెహెర్ బాబా పైనే ఏకాగ్రతను నిలుపుతూ, అటువంటి కార్యకలాపాలన్నింటినీ ఖచ్చితంగా నివారించాలి.

12. **విభిన్న మతాల, సంస్కృతుల ఆశయాలను గౌరవించడం:** "సమగ్ర దృష్టి (Integral Vision) నుండి ఆవిర్భవించే నూతన ప్రపంచ సంస్కృతి (New World-Culture), సహజంగానే సాంస్కృతిక సమన్వయాన్ని (Cultural Synthesis) తీసుకువస్తుంది. ఈ నూతన సంస్కృతిని ప్రేరేపించే ఆ దృష్టి సమగ్రమైనది (Comprehensive) కాబట్టి, అది భిన్న సంప్రదాయాల (Diverse Traditions) విలువలను నిరాకరించదు; అలాగని వాటి పట్ల ఏదో ఆదరణ చూపుతున్నట్లుగా, కేవలం నామమాత్రపు సహనాన్ని కూడా ప్రదర్శించదు. దానికి భిన్నంగా అది విభిన్న మతాలు, సాంప్రదాయాలలోని అసలు సారమైన ఉద్దేశాలను శ్లాఘిస్తుంది. సత్యం యొక్క విశాల దృష్టిని ఏ రకమైన మతం, సిద్ధాంతం, శాఖ పరిమితం చేయజాలదు. అయితే, ప్రస్తుతం ఉన్న మతాలు, సిద్ధాంతాలు మరియు శాఖలలో ఎట్టి విలువా లేదని గుడ్డిగా, పూర్తిగా నిరాకరించడం ద్వారా కాకుండా—వాటిలో నిగూఢంగా దాగి ఉన్న సత్యం యొక్క అంశాలను (Facets of the Truth) కనుగొనడం (Discovering), స్పష్టీకరించడం (Accentuating), ఆవిష్కరించడం (Unfolding) మరియు అభివృద్ధి (Developing) చేయడం ద్వారా— మానవులు ఆ పరిమితులను అధిగమించడానికి అది సహాయపడుతుంది."

13. **వివాహ బంధం యొక్క పవిత్రత:** నివాసితులు తమ జీవితాలను ప్రియతముడైన బాబాపై కేంద్రీకరించడానికి ఇక్కడికి వచ్చారు. అందువల్ల వారు వివాహం, బ్రహ్మచర్యం, వివాహేతర సంబంధం (Promiscuity) అనే వాటి గురించిన బాబా అభిమతాన్ని నెరవేర్చడానికే కట్టుబడి ఉండాలని ఆశించబడుతుంది. పెళ్లి చేసుకొన్న నివాసితులు మెహెర్ బాబా యొక్క ఆదేశాన్ని పాటించి వివాహేతర సంబంధాలను పెట్టుకోరాదు. వివాహం కాని నివాసితులు మరియు/లేదా ట్రస్ట్ ద్వారా బాబాకు సేవలు అందిస్తున్న వారు, బాబా అభిమతాన్ని గౌరవిస్తూ బ్రహ్మచర్యాన్ని పాటించాలి.

14. **ప్రయోజనాల మధ్య సంఘర్షణ (**Conflict of Interest**):** నివాసితులు ట్రస్ట్ యొక్క శ్రేయస్సు కోసం నిజాయితీగా పనిచేయాలి. ప్రయోజనాల మధ్య సంఘర్షణ తలెత్తకుండా చూసుకోవాలి. ట్రస్ట్ ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ, తమకు, తమ కుటుంబానికి లేదా స్నేహితులకు వ్యక్తిగత లబ్ధిని చేకూర్చేటువంటి, పరస్పర విరుద్ధమైన విధేయతలు (Competing loyalties) ఉన్నప్పుడు, దానిని 'ప్రయోజనాల మధ్య సంఘర్షణ' (Conflict of Interest) అంటారు. అటువంటి సంఘర్షణ తలెత్తవచ్చనసే సందేహం ఏ నివాసికైనా కలిగితే, తగిన మార్గదర్శకత్వం కోసం వారు చైర్మన్ ను సంప్రదించాలి. ఏ విషయంలోనైనా ప్రయోజనాల మధ్య సంఘర్షణ ఉంటే, సంబంధిత నివాసి ఆ ప్రయోజనం యొక్క స్వభావాన్ని ప్రకటించాలి మరియు సంబంధిత నిర్ణయాలు తీసుకోవడం లేదా ప్రభావితం చేయడం నుండి దూరంగా ఉండాలి.

15. **గోప్యత (**Confidentiality**):** ట్రస్ట్ గురించిన గోప్యమైన సమాచారాన్ని సంబంధం లేని వ్యక్తులకు చేరవేయకూడదు.

16. **ట్రస్ట్ ఆస్తి:** ట్రస్టుకు సంబంధించిన— భౌతికమైన లేదా కనిపించని—ఆస్తిని గౌరవంగాను, శ్రద్ధతోను చూడాలి. ట్రస్ట్ ఆస్తిని అనధికారికంగా వాడకూడదు.

17. **భూమి కొనుగోలు:** భూమిని కొనుగోలు చేయాలనుకునే నివాసితులు మరియు వారి దగ్గరి కుటుంబ సభ్యులు (తాతామామ్మలు, తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములు, పిల్లలు, అత్తమామలు, పిన్నమ్మలు, పెదనాన్నలు, మేనల్లుళ్లు, మేనకోడళ్లు, కజిన్స్, అత్తగారింటి వారు), ట్రస్ట్ అభివృద్ధికి ఎలాంటి ఇబ్బంది లేదని ముందుగా నిర్ధారించుకోవడానికి చైర్మన్‌ను సంప్రదించాలి.

18. **వాణిజ్య కార్యకలాపాలు**: స్పాన్సర్ చేయబడిన నివాసితులు, ట్రస్ట్ ఎస్టేట్‌లో నివసిస్తున్న నివాసితులు మరియు వారి దగ్గరి కుటుంబ సభ్యులు (వారు కూడా ట్రస్ట్ ఎస్టేట్‌లో నివసిస్తుంటే), అంతకుముందే ఉన్న వ్యాపారాలను యథాతథంగా కొనసాగించడం మినహా, ఎటువంటి వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించకూడదు.

19. **కానుకలు స్వీకరించరాదు (**No Gratuities): ఒక నివాసి, మెహెరాబాద్ నివాసిగా ఎటువంటి బహుమతులు, ఫీజులు, తగ్గింపులు లేదా స్వలాభం కోసం ఎలాంటి బహుమానాలు పొందరాదు. నివాసితులు విభిన్న బాబా కార్యక్రమాల్లో ప్రసంగించడానికి ఆహ్వానించబడినప్పుడు ప్రయాణ ఖర్చులకు, బస కోసం ఏర్పాట్లకు సముచితమైన ధనం మాత్రం అంగీకరించవచ్చును.

20. **ప్రచార మాధ్యమాలతో సంపర్కం:** నివాసితులు ఎప్పుడూ ట్రస్ట్ అధికార ప్రతినిధిగా వ్యవహరించకూడదు లేదా తమను తాము అలా చెప్పుకోకూడదు. ట్రస్ట్ ఛైర్మన్ మాత్రమే ట్రస్ట్ తరపున మాట్లాడే వ్యక్తి మరియు ప్రచార సాధనాలతో సంబంధం కలిగి ఉండే వ్యక్తి. ప్రచార సాధనాలు అనగా పత్రికలు, రేడియో, టివి, ఇంటర్నెట్, సామాజిక ప్రచార నెట్వర్క్. వీటితో సంబంధం కలిగి ఉండడం ట్రస్ట్ ఛైర్మన్ లేదా ఆయనచే అధికారికంగా నియమించబడిన ప్రతినిధుల బాధ్యత.

21. **ఇతర ప్రయోజనాలకు - సంస్థలకు మద్దతునివ్వడం (**Support of Other Causes and Organisations): ట్రస్ట్ డీడ్ (Trust Deed)కు, ట్రస్ట్ విధానాలకు (Trust Policies) మరియు ఈ నియమావళికి విరుద్ధమైన ఏ ఆశయాన్ని (Cause) లేదా సంస్థను (Organization) ఏ నివాసి కూడా ప్రచారం చేయరాదు లేదా వాటి కోసం మద్దతును అర్థించరాదు.

22. **ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను నివేదించడం** (Reporting) **మరియు నిర్వహించడం** (Handling): ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలను చైర్మన్‌కు తెలియజేయాలి. తీవ్రమైన ఉల్లంఘనలు మరియు/లేదా పదేపదే చేసే ఉల్లంఘనలు, నివాసిని స్పాన్సర్‌షిప్ నుండి మరియు/లేదా (వర్తించే సందర్భాల్లో) ట్రస్ట్ ఎస్టేట్‌లోని స్టాఫ్ క్వార్టర్స్ నుండి తొలగించడానికి కారణాలుగా పరిగణించబడతాయి. ట్రస్ట్ ఎస్టేట్ బయట నివసిస్తున్న వారితో సహా, తీవ్రమైన ఉల్లంఘనకు పాల్పడిన ఏ నివాసి అయినా ట్రస్ట్ కోసం స్వచ్ఛంద సేవ (seva)ను అందించడానికి అనుమతించబడరు. సంబధిత ట్రస్ట్ విభాగము: “రెసిడెంట్ – స్పాన్సర్‌షిప్, కాండక్ట్ & సపోర్ట్” (“Resident – Sponsorship, Conduct & Support”), ఛైర్మన్ తో సంప్రదించి, ఎటువంటి చర్య తీసుకోవాలో నిర్ణయిస్తుంది.

23. **ధర్మకర్తల (ట్రస్టీల) నైతిక నియమావళి (**Trustees' Code of Ethics**):** ఈ నియమావళి స్థానికులైన ధర్మకర్తలకు కూడా వర్తిస్తుంది. కాని ఈ నియమావళికి మరియు ధర్మకర్తల నైతిక నియమావళికి మద్య సంఘర్షణ ఏర్పడినప్పుడు ధర్మకర్తల నియమావళినే అనుసరించాలి.

24. **నియమావళి పంపిణీ:** ఈ నియమావళిని గుర్తుచేసుకోవడానికి గాను ప్రతి సంవత్సరం నివాసితులకు ఈ కోడ్ యొక్క కాపీని ఇమెయిల్ లేదా ఇతర మార్గాల ద్వారా అందించబడుతుంది.

25. **నియమావళిని సవరించడం:** ఈ ప్రవర్తనా నియమావళి ఎప్పటికప్పుడు మెరుగవుతూ ఉండే పత్రం కనుక, అవసరాలను బట్టి ట్రస్ట్ చేత సవరించబడుతూ ఉంటుంది.

చైర్మన్ మరియు బోర్డు అఫ్ ట్రస్టీస్